అన్నదాతకు కూటమి శఠగోపం!

- ఇంతవరకూ మంజూరు కాని రైతు భరోసా
- ఒక్కొక్క రైతుకు రూ.20 వేలు ఇస్తామని మోసం
- ఉచిత పంటల బీమాకు మంగళం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలా అండ
- చంద్రబాబును నమ్మి మోసపోయామంటున్న రైతాంగం


పెదకాకాని మండలంలో వరదల కారణంగా నీటిలో మునిగి ఎండిపోయిన వరి పైరు(ఫైల్)

పెదకాకాని : జగనన్న పాలనలో రైతులకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలిచింది. ముఖ్యంగా పంటల బీమా ప్రీమియం సర్కారే చెల్లించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎప్పటికప్పుడు అందజేసింది. దీంతో రైతులకు బీమా భారం తప్పింది. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలతో ఊదరగొట్టిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక తన నిజ స్వరూపాన్ని మరోసారి చూపించారు. రైతు సాయం రూ.20 వేలు ఇస్తామని ఆర్భాటంగా చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. తాజాగా ఉచిత పంటల బీమా రద్దు చేసి అన్నదాతలే చెల్లించాలని స్పష్టం చేయడంతో రైతులపై అధిక భారం పడింది. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తుతున్నారు.

కూటమి వచ్చాక కష్టాలు మొదలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతుల సంక్షేమాన్ని ఈప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా నటేట్టముంచారు. ప్రతి ఏడాది రైతులకు రూ. 20 వేల సాయం అందిస్తానని ప్రకటించినా నేటికీ దాన్ని పట్టించుకోవడం లేదు. అలాగే ఉచిత పంటల బీమా పథకానికి కూడా స్వస్తి పలికారు. రైతులే ఇక నుంచి బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు భారంగా మారింది. ఎన్నికల సమయంలో తాను మారానని, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తానని, ముఖ్యంగా అన్నదాతలకు మరింత సాయం అందిస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు తన అసలు నైజాన్ని ప్రదర్శిస్తుండటంతో రైతన్నలు అయోమయానికి గురవుతున్నారు. వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా ప్రతి ఏడాది క్రమ తప్పకుండా అమలయ్యేది. ప్రభుత్వమే బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించేది. రైతులపై ఏమాత్ర భారం మోపకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుని క్రమ తప్పకుండా ఏటా బీమాను అందించి ఆదుకునేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఉచిత పంటల బీమాను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రైతులే బీమా కంపెనీ నిర్ణయించిన ధర ప్రకారం పైర్ల వారీగా బీమా సొంతంగా కట్టుకోవాల్సి ఉంది. చంద్రబాబు చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



చంద్రబాబు రైతులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్రతి ఏటా రైతుకు రూ.20 వేలు సాయం చేస్తామన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని జమ చేయాలి. వైఎస్ జగన్ హయాంలో ప్రతి ఏడాది రైతు భరోసా కింద సాయం అందేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇంతవరకూ పెట్టుబడి సాయం అందించలేదు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా హామీని నిలబెట్టుకోకపోవడం రైతులను మోసం చేయడమే.

– జ్యోతుల సురేష్, కౌలురైతు, తంగెళ్ళమూడి

రైతులకు అండగా నిలబడాలి



వైఎస్ జగన్ హయాంలో రైతులకు అన్ని విధాలుగా మంచి జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలబడాలి. లేకపోతే రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది. ఉచిత పంటల బీమా పథకం రైతులకు వరం లాంటింది. అలాంటి పథకాన్ని రద్దు చేయడం రైతులకు అన్యాయం చేయడమే. పైర్ల వారీగా రైతులే బీమా చెల్లించుకునే పరిస్థితి రావడం దారుణంగా ఉందన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించకపోతే రైతులు ఎదురు తిరగడం ఖాయం.

– కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, రైతు, వెనిగండ్ల

క్లుప్తంగా

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ ఎస్. శ్రీనివాస బాబు హెచ్చరించారు. మండలంలోని కొత్తరెడ్డి పాలెంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని చికెన్ స్టాల్‌లో మద్యం విక్రయాలు చేస్తున్నారని నిరసిస్తూ మంగళవారం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. చికెన్ స్టాల్‌లో మద్యం సీసాలు దొరకలేదు. మద్యం విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా చికెన్ స్టాల్ యజమానికి హెచ్చరికలు జారీ చేశారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిల్వ చేరకుండా పురపాలక ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బాపట్ల రోడ్డులోని దుకాణాల ముందు మట్టి తవ్వకాలు చేపట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే, మున్సిపల్ అధికారులు చేపడుతున్న చర్యలకు ఫలితం కనిపించడం లేదు. మట్టి తొలగింపుతో వర్షపు నీరు మాత్రం కదలడం లేదు గానీ, తవ్వకాలతో మరింత లోతుగా గుంతలు ఏర్పడటంతో రోడ్లు చెరువును తలపిస్తున్నాయి. పొక్లెయిన్‌ల ద్వారా సేకరిస్తున్న టన్నుల కొద్దీ మట్టి మాత్రం తరలి వెళ్తుందని దుకాణదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నెల రోజుల నుంచి సేకరిస్తున్న మట్టి పక్కదారి పడుతోందనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ ఏఈ అపర్ణ మాట్లాడుతూ పురపాలక పరిధిలోని అభివృద్ధి పనులకు మట్టిని వినియోగిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి అడ్డరోడ్డు వద్ద ట్రాలీ ఆటో స్కూటీని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో తెనాలికి చెందిన తొడిమల చిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు రూరల్: అన్ని దానాల్లోకి రక్తదానం ఎంతో గొప్పదని గుంటూరు సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2బీఏ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 131 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ రక్తదానం అనేది ఒక మహత్కార్యమని, మనుష్యులలోని ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారంతా రక్తదానానికి అర్హులేనని చెప్పారు. మానవుని శరీరంలో ఐదు లీటర్ల రక్తం ఉంటుందని, 350 మిల్లీలీటర్లు ఇవ్వడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగదని తెలిపారు. రక్తదానం చేసి మరొక వ్యక్తి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ ప్రొఫెసర్ కె.ఎన్. రజనీకాంత్, డాక్టర్ జి నాగరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి షెడ్డు సిద్ధం

సాక్షి ఎఫెక్ట్


షెడ్డును శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి మీనాక్షి

పెదకాకాని: సాక్షి కథనానికి అగత వరప్పాడు పంచాయతీ అధికారులు స్పందించారు. చెత్త నుంచి సంపద సృష్టి షెడ్డును సిద్ధం చేశారు. పంచాయతీ కార్యదర్శి పయ్యావుల మీనాక్షి పర్యవేక్షణలో సిబ్బంది పిచ్చిచెట్లు, ముళ్ల కంచెలు తొలగించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాల్లో చెత్త, పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలు పెరిగిపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని బుధవారం చెత్త శుద్ధి ఏదీ..? పేరుతో సాక్షి పత్రికలో కథనం వెలువడింది. దీంతో స్పందించిన గ్రామ కార్యదర్శి మీనాక్షి షెడ్డును సిబ్బందితో శుభ్రం చేయించారు. వానపాములు వేసే తొట్టెలు మొత్తం ఊడ్చి శుభ్రం చేశారు. గడ్డి మందు కొట్టించారు. గ్రామంలోని చెత్తను ట్రాక్టర్ ద్వారా షెడ్డు వద్దకు తరలించారు.

ప్రాంగణ ఎంపికల్లో 51మంది ఎంపిక


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. నగర శివారు గోరంట్లలోని కళాశాలలో బుధవారం ఐఎల్ఎమ్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన 51 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఐఎల్ఎమ్ సంస్థ డైరెక్టర్లు రోనిలాకేలరీ, టి. సంజయ్, సుబ్రమణ్యం, పాషా, సోమప్ప, కళాశాల ఉపాధి కల్పనాధికారి జె. ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశం


పెదకాకాని అంగన్‌వాడీ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


ఉప్పలపాడు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెదకాకాని: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలో బుధవారం ఆమె పర్యటించారు. పెదకాకాని, కొప్పురావూరు, ఉప్పలపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, పశువుల పాకలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రూఫ్ టాప్ రైయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను పరిశీలించారు. పెదకాకాని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మిస్తున్న రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్స్ నిర్మాణాన్ని, పోషణ్ వాటికకు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ చిన్నారుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ ప్రకారం చిన్నారులకు ఇంగ్లిష్ అక్షరాలు, పాటలు, రెయిమ్స్, రంగులపై పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా బోధన చేయాలని టీచర్‌కు సూచించారు. కేంద్రంలోని సరుకులు, సంపూర్ణ పోషణ, బాలామృతం కిట్లను పరిశీలించారు. సక్రమంగా సరుకులు సరఫరా అయ్యేలా సూపర్వైజర్లు, ఐసీడీఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. పెదకాకానిలో పుష్పరాజ్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్ని పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శివాలయం వీధిలో మాంసం విక్రయ దుకాణాలను తొలగించాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. ఎస్సీల శ్మశానవాటికకు స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- కొప్పురావూరులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల పాకను కలెక్టర్ పరిశీలించారు.

లబ్ధిదారులకు చెందిన పశువుల వివరాలు, వాటి పాల ద్వారా వస్తున్న ఆదాయం గురించి తెలుసుకున్నారు. గ్రామంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని, సమీపంలో ఉన్న పొగాకు ఫ్యాక్టరీ వల్ల కాలుష్యం వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతానికి నూతనంగా నిర్మిస్తున్న రైల్వే లైను గ్రామం మధ్యలో నుంచి వెళుతోందని, అవకాశం ఉంటే ఎలైన్‌మెంటు మార్చాలని కోరారు.

- ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న రూఫ్ టాప్ రైయిన్ వాటర్ హార్వేస్టింగ్ స్టక్చర్ నిర్మాణాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థిని, స్వర్ణాంధ్ర విజన్ ప్రేరణలో బహుమతులు సాధించిన విద్యార్థినితో పాటు జాతీయస్థాయిలో వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయిన విద్యార్థినులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో సచివాలయం ఉద్యోగులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల జియో ట్యాగింగ్, ఎన్‌సీపీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎమ్మార్వో కృష్ణకాంత్, ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు మోపర్తి శ్రీనివాసరావు, సర్పంచులు గోళ్ల స్వరూప రాణి, ఆలా సాంబశివరావు, కె. శ్రీనివాసరావు, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం ఎం నాగేశ్వరరావు, సీడీపీఏ జి. వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగాదేవి, పెదకాకాని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలపతి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకులు, విద్యార్థుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుడి అభి నందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ ముల్లాషబ్బీర్‌కు విట్ ఏపీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని తెలిపారు. ఆయన 'ఎన్‌హ్యాన్సింగ్ డైసార్డరిక్ స్పీచ్ డిటెక్షన్ విత్ అడ్వాన్స్‌డ్ మెషిన్ లెర్నింగ్ ఎక్స్‌ప్లోరింగ్ సిగ్నల్ అనాలసిస్ అండ్ అప్టిమైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

గంజాయి విక్రేతల ముఠా అరెస్ట్



గుంటూరు రూరల్: గంజాయి విక్రేతల ముఠాను అరెస్ట్ చేసినట్లు సౌత్‌జోన్ డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. గంజాయి, లిక్విడ్ గంజాయిని అక్రమంగా నిల్వ చేసి విక్రయాలకు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు స్వర్ణభారతినగర్‌లో ఐదుగురు గంజాయి విక్రేతలను, వారివద్దనుంచి గంజాయి కొని సేవించే మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. స్వర్ణభారతినగర్ 21వ లైనుకు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్, ప్రకాశం జిల్లా పర్చూరు మండలం అన్నబోట్లవారిపాలెంకు చెందిన చెన్నుపాటి లోకేష్‌సాయి, స్వర్ణభారతినగర్ 12వ లైనుకు చెందిన మలకతాళ్ళ సాయి, శ్రీనగర్ 1వలైనుకు చెందిన పోలూరి దేవరాజుఆనంద, స్వర్ణభారతినగర్ 13వ లైనుకు చెందిన చిలుముల కరిష్మా విశాఖపట్నం దగ్గరలోని లంబసింగిలో గంజాయిని కొని గుంటూరుకు తెచ్చి అమ్ముతున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు రెక్కీ నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి 2.750 కిలోల గంజాయి, 555 మిల్లీలీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ 1.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని, నిందితులు ఐదుగురినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నామని పేర్కొన్నారు. వీరి వద్ద గంజాయి కొని తాగుతున్న గుంటూరుకు చెందిన షేక్ ముజీబ్, షేక్ అహ్మద్, షేక్ రోషన్, షేక్ సైదా, నల్లమేకల సత్యసాయి, గంతాల విజయ్‌కుమార్, షేక్ అబ్బాద్, మంజు మనోహర, ఉల్లంగుల సుభాష్ తదితరులనూ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు చెప్పారు. కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన సీఐ వంశీధర్, ఎస్ఐ పి.జనార్దన్, సిబ్బంది కె.సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, టి.సాంబశివరావు, కె. భిక్షనాయక్, వై.శావణసంధ్యలను అభినందించారు.

యూకేకు చెందిన సంస్థతో ఎన్జీరంగా వర్సిటీ అవగాహన ఒప్పందం



గుంటూరు రూరల్: ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం యూకేకు చెందిన సెంటర్ ఫర్ అగ్రికల్చర్ బయోసైన్స్ ఇంటర్‌నేషనల్(సీఏబీసీ) సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి తెలిపారు. బుధవారం నగర శివారు లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఈ సంస్థ లాభాపేక్ష లేకుండా పనిచేస్తోందని, యూకే కేంద్రంగా వ్యవసాయ, వాతావరణ సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు, పౌర జీవన ప్రమాణాలను పెంచే దిశగా పనిచేస్తోందని వివరించారు. ఇరు సంస్థల మధ్య శిక్షణ, సామర్థ్యం పెంపు, సమాచార మార్పిడి, పంటల ఆరోగ్యసంరక్షణ తదితర అంశాలపై అవగాహన కుదిరిందని వివరించారు. అనంతరం ఎంఓయూ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కార్యక్రమంలో సీఏబీసీ సంస్థ ప్రతినిధి డాక్టర్ మాళవిక, మధుమంజరి, విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ, డాక్టర్ ఏవి రమణ, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ పి.సాంబశివరావు, డాక్టర్ పి. రవి, జాయింట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.విశాలాక్షి పాల్గొన్నారు.

సీఎంకు ఉత్తరాలు పంపిన వలంటీర్లు



పొన్నూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె వెంకట భవాని ప్రసాద్ డిమాండ్ చేశారు. వలంటీర్స్ అసోసియేషన్ -ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో ఉత్తరాల ద్వారా సీఎంకు వలంటీర్లు విజ్ఞాపన పత్రాన్ని పంపించారు. భవాని ప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్లు కరోనా సమయంలో ప్రజల సంక్షేమం కోసం ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. ఏ రాజకీయ పార్టీకి లోబడి పని చేయలేదని, అధికారుల ఆదేశాల మేరకే పని చేశారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 10 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు కూడా విడుదల చేయాలని ముఖ్యమంత్రికి పంపిన లేఖలో కోరారు. కార్యక్రమంలో వలంటీర్స్ అసోసియేషన్ సభ్యులు షేక్ జానీ, గోపి, మోహన్, మల్లేశ్వరి, పర్వీన్ పాల్గొన్నారు.

కామాంధుడుగా మారిన చిన్నాన్న

పెదకాకాని: మైనర్‌ను తల్లిని చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలంలోని ఓ గ్రామంలో భర్త చనిపోవడంతో భార్య తన ముగ్గురు సంతానాన్ని తల్లి పోషించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇద్దరు మగ, ఒక ఆడ సంతానం కాగా వారిలో రెండవ సంతానం బాధిత బాలిక. 5వ తరగతి వరకూ చదువుకుని ఇంటి దగ్గరే ఉంటోంది. అదే ప్రదేశంలో నివసిస్తున్న చిన్నాన్న మొగులూరి శామ్యూల్ తాపీ పనులు చేస్తుంటాడు. అన్న చనిపోయిన సంవత్సరానికే అతడి భార్య కూడా అనారోగ్యంతో చనిపోయింది. దీంతో అన్న భార్యతో చనువుగా ఉంటున్న శామ్యూల్ ఆమె కుమార్తెపై కూడా కన్నేశాడు. మాయ మాటలు చెప్పి లోబరచుకుని గత ఎనిమిది నెలలుగా ఆ బాలికతో గడుపుతున్నాడు. ప్రస్తుతం నెలసరి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి డాక్టర్‌కు చూపించగా మూడో నెల గర్భిణిగా నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అక్టోబరు 31న శామ్యూల్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అతడ్ని అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ టి. నారాయణస్వామి తెలిపారు.